బాల కార్మిక వ్యవస్థ నియంత్రించేందుకు చర్యలు : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న జేసి విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బాల కార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో జెసి బాల కార్మిక వ్యవస్థకు సంబంధించిన జిల్లా టాస్కోఫ్ఫర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా బాల కార్మికులు ఇతర ప్రాంతాల నుండి మైగ్రేట్ కావడం జరుగుతుందని, దానితోపాటు హోటల్స్, హాస్పిటల్స్‌లో బాల కార్మికులు ఉన్నట్లయితే గుర్తించాలాన్నరు. అలాగే నగర ప్రాంతాలలో ట్రాఫిక్ ఉన్న చోట బాల కార్మికులు ఎక్కువగా కనిపిస్తున్నారని, వారి తల్లిదండ్రులతో చర్చించి వారిని పాఠశాలలకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారు ఉండే ప్రాంతాలను గుర్తించి పిల్లలు విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దీనితోపాటు బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల్లో ఎక్కువ మాతాశిశు మరణాలు జరుగుతాయని ఈ అంశంపై క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పలమనేరు, కుప్పం ప్రాంతాలలో ఈ సమస్యను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్‌శాఖ సమన్వయంతో సచివాలయాల్లో గల మహిళా పోలీసులు బాల్యవివాహాలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసి వెంకట రమణారెడ్డి, డిఎం అండ్‌హెచ్ ఓ డాక్టర్ ప్రభావతి దేవి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, అధికారులు పాల్గొన్నారు.

కీచక మృగంపై.. కన్నెర్ర

బాలిక తల్లిదండ్రులు, కుటుంబాన్ని పరామర్శిస్తున్న దాసరి జనార్ధన్

- మహిళ, విద్యార్థిసంఘాల నిరసన
- రూ.10 లక్షలు ప్రకటించిన సిఎం
- సమీప బంధువే కీచ(హంత)కుడు
- నేడు కెవిబిపురానికి హోంమంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

'చాక్లెట్, లేస్ తీసిస్తా' అని చెప్పి చిన్నారి (3)ని చిదిమేసిన సమీప బంధువు సుశాంత్ (22) కీచక మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వలస కుటుంబాల్లో పిల్లలకు రక్షణ లేదనడానికి ఈ ఘటనే ఉదాహరణ. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రభుత్వం తరపున హోంమంత్రి అనిత ఆదివారం మధ్యాహ్నం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియోను అందించనున్నారు. బాలికపై అత్యాచారం ఘటన వడమాలపేట మండలం ఎఎంపురం (అబ్బికండ్రిగ) పంచాయతీ యానాది కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

ఎఎంపురం పంచాయతి యానాదికాలనీకి చెందిన బాలికను అదే కాలనీలోని సమీప బంధువు సుశాంత్ (22) 'చాక్లెట్, లేస్ తీసిస్తా' అని చెప్పి శుక్రవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పొదల్లోకి తీసుకెళ్లి దారుణంగా రేప్ చేశాడు. చిన్నారి భయంతో పారిపోవడానికి ప్రయత్నించడంతో హత్యచేసి అక్కడే పూడ్చి పెట్టేశాడు. చిన్నారి కోసం తల్లిదండ్రులు వెతుకులాడి విచారించగా, విషయం శనివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు సుశాంత్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఎస్‌పి సుబ్బరాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తిరుపతి ఆర్డీవో, వడమాలపేట తహశీల్దార్ పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి విచ్చేసి మృతదేహాన్ని పరిశీలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు సి.ఆర్.రాజా, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ యువత ఉపాధ్యక్షులు చినబాబు, పట్టణాధ్యక్షులు గాలి జీవరత్ననాయుడు, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు.

నేడు హోం మంత్రి ఎస్టీ కాలనీకి రాక

కెవిబిపురం : మండలంలోని ఒళ్లూరు ఎస్టీ కాలనీకి హోంమంత్రి అనిత ఆదివారం రానున్నారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించనున్నారు. స్వయంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రభుత్వం తరపున అందజేయనున్నారు. కీచకుని చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని భరోసా అందించనున్నారు.

మానవ మృగాన్ని శిక్షించండి

ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా

అబ్బి కండ్రిగ గ్రామపంచాయతీ యానాది కాలనీలో జరిగిన ఘోరాన్ని అందరూ ఖండించాలని, మూడున్నర సంవత్సరాల చిన్న బాలికపై సుశాంత్ అనే యువకుడు లైంగికంగా అనుభవించి చంపేసి పాతి పెట్టిన వైనం అత్యంత అరాచకం అని ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా నాయకులు ఉద్ఘాటించారు. అనాదిగా ఎస్టి ఎస్సి లపై దారుణాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. బాధిత కుటుంబానికి 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఇద్దరికీ తిరుమల తిరుపతి దేవస్థానం నందు ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, సిఐటియు నేతలు వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్, నరేంద్ర, హర్షద్, గణేష్ పాల్గొన్నారు.

సుశాంత్‌ను శిక్షించాలి : సిపిఎం

కెవిబిపురం మండలం ఒల్లూరు యానాదికాలనీకి చెందిన మధు భార్యబిడ్డలతో స్థానికంగా పనులు లేక, అత్తగారి ఊరైన ఎఎంపురంలో ఉంటూ కూలి పనులకు దంపతులు వెళ్లారు. చిన్నారిని అమ్మమ్మ దగ్గర వదిలారు. అదే కాలనీకి చెందిన కామాంధుడు బాలికకు మాయమాటలు చెప్పి రేప్ చేసి హత్య చేశాడన్నారు. చిన్నారిపై ఘాతుకానికి పాల్పడిన దుర్మార్గుని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ విజ్ఞప్తి చేశారు. బాలిక కుటుంబీకులను దాసరి జనార్ధన్ పరామర్శించారు. నేరాలకు అలవాటు పడిన వారికి తప్పు చేయాలంటే భయభ్రాంతులకు గురయ్యేలా శిక్ష ఉండాలన్నారు. అపుడే న్యాయ వ్యవస్థపై, పోలీసులపై ప్రజలకు నమ్మకం ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని, బతుకుదెరువు కోసం సొంత గ్రామంలో ఐదు ఎకరాల భూమి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

చిన్నారి హత్య పై దిగ్ర్భాంతి వ్యక్తం చేసిన ఎంపీ

చిత్తూరు అర్బన్: నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, ఏ.యం.పురం (అబ్బి కండ్రిక) పంచాయతీ యానాది కాలనీలో జరిగిన చిన్నారి హత్య తనను తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చిన్నారి సాన్విక కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముక్కు పచ్చలారని పసికందు ప్రాణాలు తీసిన నిందితుడు సుశాంత్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి అఘాయిత్యాలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా మానవ మృగాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన తెలియజేశారు. బాదిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.

నిందితుడ్ని బహిరంగంగా ఉరి తీయాలి

వైసిపి రాష్ట్ర మహిళా నాయకురాలు కృపాలక్ష్మి

వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని గంగాధర నెల్లూరు వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర మహిళా నాయకురాలు కొత్తూరు కృపాలక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యమే వడమాలపేట ఘటనకు కారణమని ఆరోపించారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ చట్టం దిశా యాప్ నిర్వీర్యం చేయడంపై ఉన్న శ్రద్ధ మహిళ రక్షణపై లేదన్నారు. నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర హోం మంత్రి అనిత స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అభివృద్ధి పేరుతో అన్యాయం

ప్రజాదృష్టి

చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం అభివృద్ధి పేరుతో సంవత్సరాల కొద్దీ భక్తులకు సేవలు అందిస్తున్న చిరు వ్యాపారస్తుల షాపులను గత ప్రభుత్వ హయాంలో దౌర్జన్యంగా తొలగించి అన్యాయం చేసిందంటూ బాధితులు లబోదిబో అంటున్నారు. 130 మంది చిరు వ్యాపారస్తులు 40, 50 సంవత్సరాలుగా షాపులు ఏర్పాటు చేసుకొని భక్తులకు, పూజ సామాగ్రిలు, వంట వండించడం, పాత్రలు బాడుగులకు ఇవ్వడం, షామియానాలు ఇవ్వడం రకరకాల సేవలు అందిస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్, అభివృద్ధి పేరుతో పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా షాపులను, ఇళ్లను అక్రమంగా తొలగించింది. మరో చోట ఇంటి స్థలం ఇస్తామని మోసం చేసింది. గతంలో ఆ ప్రభుత్వంలో దౌర్జన్యానికి భయపడి ఎవరు ముందుకు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత న్యాయం జరుగుతుందని ఆశతో పోరుబాట పట్టారు. శ్రీగంగమ్మ దేవస్థానం బాధితుల కమిటీ ఏర్పాటు చేసుకొని ఇప్పటికే బోయకొండ కార్యాలయం వద్ద, చౌడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద, అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన బాధితులకు న్యాయం జరగడం లేదు. ఈ పోరాటంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించడంతో స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేస్తామని ఇప్పటివరకు పని ప్రారంభించలేదు. బాధితులు అందరూ గుడి అభివృద్ధి కోసం అన్ని రకాలుగా నష్టపోయి సహకరించినప్పటికీ అధికారులు సహకరించకపోవడం దారుణం. ఎక్కడైనా అభివృద్ధి కోసం స్థలాలు ఇతరత్రా వాటిని స్వాధీనం చేసుకునే ముందు బాధితులకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసి తర్వాత తీసుకోవాలని 2013 భూసేకర చట్టం స్పష్టంగా ఉన్నప్పటికీ ఇక్కడ అవేమి పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా చేశారు. రెవెన్యూ అధికారులను అడిగితే దేవస్థానం వాళ్లకు సంబంధించిందని దేవస్థానం వాళ్ళని అడిగితే రెవెన్యూ వాళ్ళు తేల్చాలని ఒకరిపై ఒకరు చెబుతున్నారు తప్ప బాధితులకు న్యాయం జరగడం లేదు. ఈ దేవస్థానంకి రోజురోజుకీ ఆదాయం పెరుగుతోంది. మన రాష్ట్రం నుండే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుండి అత్యధికంగా భక్తులందరూ మొక్కులు తీర్చుకోవడానికి వస్తున్నారు. మరి అలాంటి భక్తులకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్న ఈ చిరు వ్యాపారస్తులకు మాత్రం ఎవరూ న్యాయం చేయడం లేదు. కాంప్లెక్సు కట్టి కావల్సిన వారికి టెండర్లు తీసుకొని వేలకు వేలు సంపాదిస్తున్నారు తప్ప బాధితులని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాంప్లెక్స్ బాధితులకు రూములు కేటాయించాలని బాధితుల పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది.

– విజిఆర్

10 శాతం టీబీ పరీక్షలు తప్పనిసరి

అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ వెంకటప్రసాద్

మాట్లాడుతున్న అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ల్యాబ్స్‌లో పది శాతం టీబి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ ల్యాబ్ టెక్నీషన్లను ఆదేశించారు. శనివారం స్థానిక డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషన్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ 10శాతం ఓపీలో తప్పనిసరిగా టిబి పరీక్షలు చేయాలన్నారు. అలాగే పిహెచ్‌సిలో ప్రతి ఆశ కార్యకర్త ప్రతివారం గల్ల పరీక్ష కిట్ల ద్వారా అనుమానిత కేసుల నుంచి గళ్ళ సేకరించి పిహెచ్‌సిలో పరీక్షించాలి. డాక్టర్లు, సూపర్వైజర్లు వీటన్నింటినీ మానిటర్ చేస్తూ పాజిటివ్ వచ్చిన పేషెంట్స్ కి చికిత్స ప్రారంభించి పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. 2025కు టీబీ లేని సమాజ స్థాపనే అందరి ధ్యేయంగా పనిచేయాలన్నారు. డాక్టర్ అనిల్ మాట్లాడుతూ అక్కడక్కడ మలేరియా, డెంగీ కేసులు కనిపిస్తున్నందున రక్త పరీక్షలు విరివిగా చేపట్టాలని ఫీల్‌లో ఆర్‌డిటి కిట్లు ద్వారా రక్త పరీక్షలు పరీక్షించాలన్నారు. డెంగీ పాజిటివ్ వస్తే జిల్లా ఆసుపత్రికి పంపి పరీక్షించి కన్ఫామ్ చేసి వెంటనే చికిత్స ప్రారంభించేటట్లు చూడాలన్నారు. దీని వలన డెంగీ మరణాలు లేకుండా చూడొచ్చని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ఏఎంఓ రామచంద్రా రెడ్డి, ఎపిడిమియాలజీస్ట్ శ్రీవాణి, సబ్ యూనిట్ అధికారులు రామచంద్ర, శివకుమార్, జిల్లాలోని పిహెచ్‌సిల ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

గుంతల రహిత రహదారులే ధ్యేయం

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఏ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రహదారి ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా జిల్లాలోని రహదారులను గుంతల రహిత రహదారుల సాధన కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరు పట్టణంలోని ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద గల స్టేట్ హైవే బిటి రోడ్డుపై గల గుంతలను మరమ్మతు చేసే కార్యక్రమాన్ని ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, మేయర్ అముదలతో కలసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్ అండ్ బి పరిధిలో గల రోడ్ల మరమ్మతుకు చర్యలు చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా రూ.6.72 కోట్లతో 482 కి.మీల బిటి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి రూ.19లక్షలతో మంజూరైన 12.5 కి.మీల రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్, ఎంఎల్ఏ, మేయర్ బిటి రోడ్డుపై తారు, కంకర వేసి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. మాజీ మేయర్ కటారి హేమలత, ఆర్అండ్‌బి ఈఈ శ్రీనివాసులు, డీఈ నాగమల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్సీ

కుప్పం రూరల్ : ప్రజారక్షణ ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నంతో కలిసి వసనాడు గ్రామంలో గుంతలు లేని రోడ్లు కార్యక్రమంలో భాగంగా రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్సీ ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో మొదటి విడతగా 51 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు రూ.1.2 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఐరాల: ఏపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఐరాల మండలం, వైయస్.గేటు గ్రామంలో ప్రారంభించారు. వైయస్.గేటు - పుల్లూరు ఎర్రేపల్లి మార్గంలో భూమిపూజ చేసి గుంతలు పడిన రోడ్డుకు స్వయంగా కంకర, తారు వేసి గుంతను పూడ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి గుంతల రోడ్లు పూడ్చేందుకు రూ.84 లక్షలు, గతంలో నాణ్యత లేని, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు గానూ రూ.52 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. అలాగూ త్వరలో యాదమరి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం యాదమరి రోడ్డును పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరిబాబు నాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

కుప్పంలో ఎమ్మెల్సీ

గజ దాడులపై అప్రమత్తంగా ఉండాలి

ఏకో టూరిజం పార్క్‌ను పరిశీలించిన యశోద భాయ్

ప్రజాశక్తి - రామకుప్పం: అటవీ సరిహద్దు ప్రాంతాల్లో గజ దాడుల పై అటవీ సిబ్బంది ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని అనంతపురం అటవీ శాఖ చీఫ్ కంజర్వేటర్ యశోద భాయ్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారిని భరణితో కలిసి రామకుప్పం మండల పరిధిలోని ననియాల ఏకో టూరిజం పార్క్‌ను పరిశీలించారు. ముఖ్యంగా ఎలిఫెంట్ షెడ్‌లోని శిక్షణా (కుంకీ) గజరాజుల ద్వారా జంగిల్ సఫారి ఏర్పాటుపై సాధ్యఅసాధ్యాలను పరిశీలించారు. అదేవిధంగా అటవీ సంరక్షణపై బెస్ క్యాంప్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. వారివెంట పలమనేరు సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్, కుప్పం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయశంకర్ ఉన్నారు.

వరి పంటపై ఏనుగు దాడి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వరి పంటపై ఏనుగులు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని రాగిమను పెంట రెవెన్యూ రాళ్ల వంక గ్రామంలో చోటు చేసుకుంది. రైతు సూరమ్మ ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు వరి పంటపై దాడి చేసిందని, వరి పంట కోత దశ ఉండగానే ఏనుగు తిని, తొక్కి పంట నష్టం చేసిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

శేష జీవితం ఆనందంగా గడపండి.. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అక్టోబర్ నెల పదవీ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ అశోక్ కుమార్ , క్లాస్‌ఫోర్ ఉద్యోగి వెంకటమ్మకు జిల్లా ఎస్‌పి మణింకఠ చందోలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 43 సంవత్సరాల పాటు వారు అంకిత భావంతో అందించిన సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. పోలీసు డిపార్టుమెంటులో పనిచేయడం సవాల్‌తో కూడుకొన్నదని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన నాటి కాలంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించి ఆనందంగా శేషజీవితాన్ని గడపాలని కోరుతున్నట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న జిల్లా ఎస్పి

కిక్కే.. కిక్కు..

- కొత్త విధానంలోనూ వక్రమార్గాలు
- చాటుమాటుగా బెల్టుషాపులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ మొదలైంది. జిల్లాలోని 104 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా ప్రభుత్వం కేటాయించింది. మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసేందుకే ఒక్కో దరఖాస్తులకు రూ.2లక్షలు వెచ్చించాల్సి వచ్చింది. పది, పదిహేను షాపులకు దరఖాస్తు చేసిన వారు కోట్లలో దరఖాస్తుల కోసం ఖర్చు చేశారు. షాపు దక్కించుకున్నాకా ఏడాదికి అర్బన్ పరిధిలో రూ.65లక్షలు, రూరల్ పరిధిలో రూ. 55 లక్షలు విడతలవారీగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్త ఖర్చు చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణం నడిపితే గిట్టుబాటు ఎలా అవుతుందని అనుకున్నారేమో వక్రమార్గాలు తొక్కుతున్నారు.

పట్టణాలు, పల్లెలు అని తేడా లేకుండా బెల్టుషాపులు ఏర్పాటు చేసి అధిక రేట్లకు మద్యం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈనెల 16 తేదీ నుండీ నూతన మద్యం పాలసీ మేరకు మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళాయి. నాటి నుంచి సంపాదనే ధ్యేయంగా బెల్టుషాపుల ఏర్పాటుకు మద్యం దుకాణాల యజమానులు పావులు కదుపుతున్నారు. ఇలా జిల్లాలోని అనేక మండలాల్లో బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. మద్యం దుకాణాలు లేని ప్రాంతాల్లో చిన్నచిన్న కిరాణా షాపులు, హోటల్స్‌ను ఇందు కోసం ఎంపిక చేసుకొని రూ.50 వేల నుండీ రూ.2 లక్షల వరకు అడ్వాన్స్ రూపంలో తీసుకొని మద్యంషాపు యజమానులు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇలా బెల్టుషాపులు ఏర్పాటు చేసుకున్న వారు ఎంఆర్‌పి ధర కంటే రూ.30 నుంచి 40లు అదనంగా అమ్ముతున్నారు.

ఇష్టారాజ్యంగా..

మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుండీ రాత్రి 10 గంటల వరకు నడుపుకోవచ్చు అన్నది నిబంధన. అయితే లక్షలు వెచ్చించిన మద్యం దుకాణాదారులు ఉదయం 9గంటలకే తెరిచి రాత్రి 11 గంటల వరకు విక్రయాలు జరుపుతున్నా అడిగే నాధుడేకరువయ్యారు. గుడి, బడి అని తేడా లేకుండా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల ముందు చిన్న పిల్లులు, వృద్ధులు, మహిళలు వెళ్ళేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చిత్తూరు నగరంలో దుర్గా సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం బస్‌స్టాప్ సమీపంలోనే ఉంది. అలాగే ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద ఇదే పరిస్థితి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో జనసంచారం ఎక్కువ ఉన్న రోడ్లు పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మద్యం షాపులకు అనుమతు మంజురు చేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తుంటంతో మద్యం విక్రయాలు విచ్చిలవిడిగా నిబంధనలకు విర్ధుంగా సాగుతున్నాయని ఆరోపణలను వెల్లువెత్తున్నాయి.

ఏరియాలు పంచుకుంటూ...

బెల్టు దుకాణాల కోసం మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు ఏరియాలను పంచేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో బెల్టుషాపు నాది.. నేనే మద్యం సరఫరా చేస్తా అంటూ అక్రమమార్గాల్లో మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బెల్టుషాపుల ఏర్పాటుపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదనే విషయాన్ని మరచి మరీ దందా కొనసాగిస్తున్నారు. బెల్టుషాపులు సాఫీగా కొనసాగేలా స్థానిక రాజకీయ నాయకులతో బేరసారాలాడుతున్నారు. ఇలా స్థానిక నేతల అండదండలతో పట్టణాలు, పల్లెల్లో నిబంధనలకు విర్ధుంగా బెల్టుషాపులు నడిపేస్తున్నారు.

అస్తవ్యస్తంగా సదుం కాలేజ్ రోడ్డు

● **అవస్థలు పడుతున్న ప్రజలు**

ప్రజాశక్తి- సదుం : సదుం మేజర్ గ్రామ పంచాయతీ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ముఖ్యంగా కాలేజ్ రోడ్డు గుంతలమయం కావడంతో వాహనాలు నడపాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్న పరిస్థితి. సదుం పోలీస్‌స్టేషన్ ఆనుకొని నాయన పాకాల రోడ్డు ఉంది. ఈ రోడ్డు పొడవునా ఇండియన్ బ్యాంకు, పోస్ట్ ఆఫీస్, వినాయక అగ్రి పాలిటెక్నిక్ కళాశాల, వినాయక డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పశు వైద్యశాల, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అలాగే ఎర్రతివారిపల్లి రోడ్డు మార్గం గుండా ప్రభుత్వ వెటర్నరీ కళాశాల, వెలుగు కార్యాలయం, ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి కాలేజీ ఇలా అన్నింటికి రోడ్డే మార్గం. ఈ రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. అయితే రోడ్లపై ఏర్పడిన గుంతలు ఒక సమస్య అయితే ఇక వర్షం పడితే ఆ గుంతల్లో వర్షపు నీరుచేరి రోడ్డు కాస్త మరింత బురదమయమై వాహనదారులతోపాటు పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు ఇదే మార్గంలో వెళ్లాల్సిన ప్రజలు, విద్యార్థులు రోడ్డు ఇలా ఉంటే ఎలా అంటూ వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గుంతల మయమైన సదుం రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు..?

● **కాళ్లు చేతులు విరిగినా పట్టించుకోరా..**

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం కొత్తపేట కుర్మాయపురం ప్రాంతంలో అధ్వానంగా ఉన్న సిసి రోడ్డుకు మోక్షం ఎప్పుడు, కాళ్ల చేతులు విరిగినా పట్టించుకోరా.. అంటూ బాధితులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కురుమయిపురం ప్రాంతంలో నివాసం ఉంటున్న కుప్పమ్మ అధ్వానంగా ఉన్న సిసి రోడ్డుపై నడవలేక అదుపు తప్పి పడిపోవడంతో చేయి విరిగింది. సమాచారం అందుకున్న కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు, దళిత నాయకులు కన్నన్ బాధితురాలిని పరామర్శించి, వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టిడిపి సానుభూతిపరులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్లు వెయ్యలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కారణంగానే రోడ్డు మొత్తం గుంతల మయంగా మారాయని, ఈ రోడ్డుపై జనం నడవడానికి సైతం ఇబ్బందిపడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనను వెంటనే ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మణిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుకు తెలియజేసి వారి సహకారంతో రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.

కంకర తేలిన సిమెంట్ రోడ్డు

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

విద్యార్థులు బహుమతులు ప్రధానం చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కొంగారెడ్డిపల్లి ఎంసిహెచ్ స్కూల్‌లో పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు, అస్టింట్ మేనేజర్ బరకతుల్లా, జూనియర్ ఇంజనీర్ రవితేజ, పాఠశాల ప్రధానోపాధ్యయురాలు గీతాంజలి, ఉపాధ్యాయులు పిల్లలకు అవినీతి రహిత దేశం కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. పిల్లలు చిన్ననాటి నుండీ నిజాయితీగా ఉంటూ దేశ అభివృద్ధిలో పాల్గొనాలని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

శాంతా రామ్‌కు సన్మానం

శాంతారామ్‌ను సన్మానిస్తున్న టిడిపి మండల నాయకులు

ప్రజాశక్తి- గుడిపల్లి: తిరుపతి తిరుమల దేవస్థానం బోర్డు మెంబర్‌గా ఎంపికైన వైద్యం శాంతా రామ్‌ను శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టిటిడి బోర్డ్ మెంబర్‌గా కుప్పం నియోజకవర్గం కుప్పం మండలం చెందిన వైద్య శాంతారామ్‌కు అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, క్లస్టర్ ఇంచార్ హేమంబార్ గౌడు, మాజీ సర్పంచ్ అరుణాచలం, సుబ్రమణి, ప్రకాష్, మూర్తి, భాను పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి

ప్రిన్సిపల్ డాక్టర్ వి.నారాయణ మూర్తి

ప్రజాశక్తి- కుప్పంటౌన్: విద్యార్థులందరూ ఐకమత్యంగా మెలిగినప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.నారాయణమూర్తి తెలిపారు. శనివారం రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ప్రసంగిస్తూ ఐక్యమత్యం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. దేశంలోని రాష్ట్రాలను ఐక్యం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ చంద్రబాబు, శ్రీనివాసులు, నాగరాజు, వెంకటాచలం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి- విజయపురం: రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కల వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలో గాండ్ల గండ్రిగ చెక్పోస్ట్ నుండి విజయపురంకు వెళ్లే రోడ్డు చుట్టూ పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరగడం వలన మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనపించపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారలు చర్యలు తీసుకోవాలని రోడ్డుకు ఇరువైపులా మొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని మిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో శనివారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య విద్యార్థులకు విద్యాసామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివ్య, విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ హేమలత, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ముత్తు, శివానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న చంద్రయ్య

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న జడ్జి లిఖిత

ప్రజాశక్తి- పలమనేరు: డిసెంబర్ 14వ తేదీ జరనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లిఖిత కోరారు. శనివారం పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి లిఖిత మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం కక్షిదారులకు జరుగుతుందని, రాజీమార్గమే రాజ మార్గమని దీన్ని ఇరు పార్టీల కక్షిదారులు అర్థం చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వారా న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది తమ వంతు సహాయ సహకారాలను అందజేసి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి, పరమశివప్ప, ఎల్.భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

కళాశాలకు పుస్తకాలు అందజేస్తున్న స్వరూప్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను పూర్వవిద్యార్థి స్వరూప్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2004 నుండి 2007 వరకు ఈ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్‌లో పట్టా పొందినట్టు తెలిపారు. ఆనాటి అధ్యాపకుల బోధన వల్ల, వారు అందించిన సలహాలు సూచనల కారణంగా నేడు అమెరికా దేశం కాలిఫోర్నియా నగరంలో గల సిగ్న గ్రూప్ సంస్థలో పైతాన్ డెవలపర్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. తాను చదివిన కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ పడాలన్న ఉద్దేశంతో లక్ష రూపాయలు విలువచేసే పాఠ్యపుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు, అధ్యాపకులు పుస్తకాల దాతను అభినందించారు.

పంట నష్టాన్ని ఇప్పించండి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గత మూడు రోజుల ముందు గాలీవాన వలన చేతికి అంది వచ్చే వరి పంట మొత్తం కింద పడిపోయి పంట దెబ్బతిందని, పంటను నష్టాపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలుచోటల్లో ఇదే పరిస్థితి ఏర్పడుతున్నది అధికారులు వరి పంటను పరిశీలించి నష్టపరిహారానికి సిఫార్సు చేయాలని రైతులు కోరుతున్నారు.

దళితులపై దాడి చేసి వారిని

వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- పలమనేరు: కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామ దళిత యువకులపై దాడి చేసి పరారీలో ఉన్న అగ్రకులస్తులను వెంటనే అరెస్ట్ చేయాలని జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ బృందం డిమాండ్ చేశారు. శనివారం శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక మానవ హక్కుల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డివి మునిరత్నం, గుర్రం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దళిత యువకులపై దాడి జరిగి సుమారు నాలుగు రోజులు గడుస్తున్న డాడి చేసిన అగ్రకులస్తులు 8 మందిని అరెస్టు చేసి, మిగిలిన వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం ఏమిటిని ప్రశ్నించారు. నలుగురు దళిత యువకులను బట్టల ఊడదీసి 40 మంది అగ్ర కులస్తులు వివక్షణారహితంగా దాడి చేయడం పిరికిపందచర్యగా అభివర్ణించారు. వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్థసారథి, డి. సుబ్రహ్మణ్యం, నాగార్జున, గంగప్ప, ఆనంద్, వెంకటేష్, రమణ, పాల్గొన్నారు

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

పజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన మణిమొదలి అనారోగ్య కారణంతో వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆయనకు తూగుండ్రం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరీష్ తన సొంత ఖర్చులతో ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4వేలు అందజేశారు.

చౌడేపల్లి: చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన మునెమ్మ తీవ్ర అనారోగ్యంతో చిత్తూరు దగ్గర గల పుల్లూరులో చికిత్స పొందుతోంది. దీంతో సచివాలయ అధికారి చంద్రశేఖర్ ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను వృద్ధురాలికి అందించాడు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కార్వేటినగరం: స్థానిక డీఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కేశవులు తెలిపారు. బంగారుపాలెం మండలం రాగిమాను పెంట ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు తిరుమల రాజు తెలిపారు. జిల్లాస్థాయి అండర్ -14 పోటీల్లో వినాయక, పావని సాయి, సాయి కిరణ్, అండర్ -17లో శశి రాం, మౌళి, విజయదుర్గ ఉత్తమ ప్రదర్శన కనపరచారని విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు సరస్వతి, సుబ్రమణ్యం రెడ్డి, వెంకట రమణయ్య, డిల్లి బాబు, చిన్నయ్య శెట్టి, రంజిత్ కుమార్, మాలతి, సుమతి, హరిప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిఎన్ఆర్ విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- గుడిపాల: రాష్ట్రస్థాయి పోటీలకు సిఎన్ఆర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల అధినేత లోకేష్ శనివారం తెలిపారు. చిత్తూరు మెసానికల్ క్రీడా మైదానంలో జరిగిన అండర్- 19 ఖోఖో పోటీలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికాంత్, ఝాన్సీ రాణి, తిరుపతి మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ -17 బేస్బాల్ పోటీలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జ్యోత్స్న, దేవి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు అండర్ -14 బేస్బాల్ జిల్లా స్థాయి పోటీలలో 9వ తరగతి చదువుతున్న గౌతం, మనోజ్, ఆరవ తరగతి చదువుతున్న లిల్లీదర్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల అధినేత అభినందించి మరిన్ని క్రీడల్లో రాణించి మంచి క్రీడాకారులుగా తయారవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ప్రధాన ఉపాధ్యాయురాలు సుధా, తెలుగు అధ్యాపకులు అర్జున్, వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్ పాల్గొన్నారు.

సచివాలయంలో జెడ్‌పి సీఈవో తనిఖీలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : మండలంలోని జిల్లేడుపల్లి సచివాలయాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులకు కురిసిన వర్షానికి సచివాలయంలో వర్షపు నీరు ఉరుస్తుండటంతో సచివాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. అనంతరం సచివాలయాన్ని తంబుగానిపల్లి పంచాయతీ ఆర్‌బికె కేంద్రానికి బదిలీ చేశారు. సర్పంచ్ భారతి ఫిర్యాదు మేరకు గత ఐదు సంవత్సరాలుగా ఈ భవనంలోనే సచివాలయం కార్యకలాపాలు జరిగాయని, ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న భవనానికి మార్చి కార్యకలాపాలు చేపట్టాలని విన్నవించారు. స్పందించిన సీఈవో ఎంపీడీవో శ్రీధర్ సచివాలయ భవనానికి కాంటాక్ట్‌లతో మాట్లాడి నూతన సచివాలయ బదిలీ చేసే విధంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూటా జిల్లా అధ్యక్షులుగా మునీర్ అహ్మద్

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వ్యవస్థాపకులు హిదాయతుల్లా ఆధ్వర్యంలో ఉర్దూ సదస్సు పలమనేరులోని ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రూటా జిల్లా అధ్యక్షులుగా గుండ్లూరు మునీర్ అహ్మద్ ఎన్నియ్యారు. ఉర్దూ పాఠశాలలు అభివృద్ధికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం రూట ఎల్లప్పుడూ ముందు ఉంటుందని రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖలందర్ బాషా ఎన్నికల అధికారిగా, అసోసియేట్ అధ్యక్షులు హాసనుల్లా సాహెబ్, నఖీయుల్ల పరిశీలకులుగా వ్యవహరించి చిత్తూరు జిల్లా ఎన్నికలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా జి.మునీర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిఎస్‌జి.మహమ్మదుల్లా షా, కోశాధికారిగా షేక్ ఇలియాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రబ్బానీ, గౌరవ అధ్యక్షులుగా మహమ్మదలి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారితో రూట రాష్ట్ర కో ఆర్డినేటర్ అయ్యూబ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఉర్దూ పాఠశాలు, ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

రూటా జిల్లా అధ్యక్షులు మునిర్ అహ్మద్

టీటీడీ ఆస్తులను పందేరం చేయొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తులను పందేరం చేయవద్దని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ బాలికల పాఠశాల ఏర్పాటు పేరిట కంచి మఠానికి అలిపిరి వద్ద ఐదు ఎకరాల స్థలాన్ని ఏడాదికి 1000 రూపాయల లీజుతో ఐదు ఎకరాలకు 5వేల చొప్పున 30 ఏళ్ల పాటు లీజుకు ప్రకటించడం సమంజసమైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో కేటాయింపులు చేయడానికి అవకాశం ఉన్నా అత్యంత కీలకమైన స్థానంలో ఉన్న టిటిడి స్థలాలను కంచి మఠానికి 5 ఎకరాలు కేటాయించటం సమంజసం కాదన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించాలని కందారపు మురళి ఆ ప్రకటనలో కోరారు. గతంలో తిరుపతి ఎయిర్ పోర్ట్ వద్ద మెడికల్ కాలేజీ నిర్మిస్తామని ఎకరాల కొద్ది భూములను పొందిన కంచి మఠం వారు ఆ కార్యక్రమాన్ని అమలు చేయకపోవడంతో గతంలో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ కేటాయింపును రద్దు చేశారని గుర్తు చేశారు.

In The Court of the prl. District Judge: Chittoor
CRLMP No: 703/2023
CRLA /2023, CC No.220/2007
M.Ravi ...Appellent
V/s
The State Rep. by the sub-inspector police Nagari Police Station & Others
...Respondents
SUMMONS TO THE RESPONDENT NO.5/ACCUSED NO.5
S. Mohan & Manohar Naidu S/o S.Ramakrishna Naidu, Chavaram Bakkam Village, Nindra Mandal, Chittoor District.
పై కనిన 5వ రెస్పాండెంటుకు సమన్లు నిమిత్తం తేది. **18.11.2024** ఉదయం 10.30 గంllలకు పై కనిన కోర్టులో పై కనిన 5వ రెస్పాండెంటు హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
N.SRINIVASA RAO
Advocate, Tirupati

క్రైం న్యూస్

ఇద్దరు నిందితులు అరెస్టు

నిందితులను చూపుతున్న సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్సై ధరణిధర్

ప్రజాశక్తి- ఐరాల: ఐరాల మండల పరిధిలో గత నెల 29న తిరుపతి -బెంగళూరు ఆరు లైన్ల జాతీయ రహదారిలోని బొమ్మసముద్రం వద్ద జరిగిన దారిదోపిడి కేసును కాణిపాకం పోలీసులు చేధించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో చిత్తూరు వెస్ట్ సిఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణిధర్ మాట్లాడారు. ఐరాల మండలం ఎం.పైపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. వీరి నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు మరో చోరీకి సంబంధించిన మూడు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు పలు కేసులలో ముద్దాయిలుగా ఉంటూ మళ్లీమళ్లీ దారి దోపిడీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న తెలిపారు. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని దారి దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. రాత్రి వేళలో ప్రయాణించేవారు జాగ్రత్తలు తీసుకోవాలనీ బంగారు ఆభరణాలు ధరించి వెళ్లరాదని ప్రజలకు సూచించారు. కాణిపాకం ఆలయానికి వచ్చే భక్తులు వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను లాకర్లలో ఉంచుకోవాలని తెలియజేశారు. జాతీయ రహదారిలో దారి దోపిడీలను అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి : రెండు స్కూటర్లు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకుంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో ఎదురుగా వస్తున్న రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పలమనేరు మండలం గుండ్లపల్లికి చెందిన భానుప్రకాష్, సుజాతలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108లో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో భానుప్రకాష్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు సిఫారసు చేశారు.

బంగారు గొలుసు లాక్కెళ్ళిన దుండగులు

ప్రజాశక్తి- చౌడేపల్లి: చిరునామాను అడుగుతూ వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్ళిన సంఘటన శనివారం చౌడేపల్లెలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు... చౌడేపల్లి పట్టణ పరిధిలోని గడ్డంవారిపల్లి రోడ్డులో నివాసముంటున్న రాజమ్మ (85) ఇంటి వద్దకు వెళ్లి ఓ వ్యక్తి చిరునామాను అడిగాడు. ఆమె చెబుతుండగా మరో వ్యక్తి వెనుకనే వచ్చి తన మెడలో ఉన్న 42 గ్రాముల బంగారం గొలుసును లాక్కుని బైక్‌పై ఇద్దరూ ఉడాయించారు. వారిని కొందరు వెంబడించగా అతివేగంగా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో బాధితురాలు రాజమ్మ కుమారుడు శివశంకర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు కేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- రేణిగుంట : తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆం.ప్ర రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్‌కు ఆర్డీఓ శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డి ఎస్పీ రేణిగుంట శ్రీనివాసులు, డిఎం సివిల్ సప్లైస్ సుమతి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజు, ఇంచార్జి తాసిల్దార్ రేణిగుంట శ్యామ్ ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్థానిక చెన్నారెడ్డి కాలనీ మునిసిపల్ ప్రైమరీ స్కూల్ నందు దీపం -2 కార్యక్రమంలో పాల్గొని గ్యాస్ సిలిండర్లను లబ్దిదారులకు అందజేశారు.ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు.

స్విమ్స్‌లో నిర్మాణాలను వేగవంతం చేయాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, ఇతర భవనాలను వేగవంతంగా పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి. కుమార్ తో కలిసి శనివారం సాయంత్రం స్విమ్స్‌లోని వివిధ విభాగాలలో రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. ఇందులో ప్రధానమైన విభాగాలతో పాటు, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ తదితర విభాగాధిపతులతో వారి వారి విభాగాలలో జరుగుతున్న చికిత్సలు, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, రోగుల సంఖ్య పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. అనంతరం జనరల్ వార్డ్, పద్మావతి ఆసుపత్రిలోని మూడవ అంతస్తులోని ఆపరేషన్ థియేటర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, ఎస్ఈ మనోహరం, ఈఈలు ప్రసాద్, మల్లికార్జున్, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్లు గోల్డ్ ఇన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, నేషనల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ప్యాట్రన్ ఏ.ఈశ్వర ప్రకాష్ ఆవిష్కరించారు. స్థానిక జోష్ ప్రాపర్టీస్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ మెన్ ఫిజిక్‌తో కూడా విమెన్ ఫిజిక్, మెన్ మోడలింగ్, విమెన్ మోడలింగ్ ఈవెంట్లను ఈ సంవత్సరం జతపరచడం సంతోషకరమని అన్నారు. గోల్డెన్ ఇండియా ఫెడరేషన్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల పోటీలను తిరుపతిలో డిశంబర్ 1వ తేదీ నిర్వహిస్తామన్నారు. వీటిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు మెడల్స్ బహుకరిస్తామన్నారు.